


# ఘనంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామ దేవత పోచమ్మ తల్లికి, బుధవారం ముదిరాజుల కుల దైవమైన పెద్దమ్మ తల్లి పెద్దిరాజుల కల్యాణం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆరె రాజు ముదిరాజ్ అన్నారు. అందరిపై పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆడపడుచులంతా సంప్రదాయ దుస్తులలో నెత్తిన బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. ఐదేళ్లకు ఒకసారి పెద్దమ్మతల్లి పెద్దిరాజుల కల్యాణం జరుపుతామని చెప్పారు. డప్పు చప్పుళ్లు.. బైండ్ల పూజారుల పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముదిరాజ్ సంఘం సభ్యులు, యూత్ సభ్యుల సహకారంతో పండగ ఘనంగా నిర్వహించుకున్నామని పేర్కొన్నారు.



# కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోల నూతన కార్యవర్గం

**ప్రజానావ, కరీంనగర్:** నూతనంగా ఎన్నికైన జిల్లా టీఎన్జీవోల సంఘం కార్యవర్గం కలెక్టర్ చిత్ర మిశ్రాను జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్ర మిశ్రా నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేస్తూ, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి తగిన విధంగా పరిష్కరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఎన్జీవోల సంఘం క్రమశిక్షణ గల సంఘమని, ప్రజల సేవలో మరియు ఉద్యోగుల సంక్షేమంలో పరస్పరం కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. సంఘ నాయకులు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో సంఘ ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణాధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు రమేశ్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇరుమల్ల శారద, సబితా విజయలక్ష్మి, సుస్మిత, కరుణ, పవన్ కుమార్, అస్గర్ అలీ, కమలాకర్, కరుణాకర్, కయ్యం శ్రీనివాస్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన

- **శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొననున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**ప్రజానావ, సిరిసిల్ల:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయం (మూడు గుళ్లు)లో జరిగే సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం ఉదయం 11:30 గంటలకు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలలో ఉన్న సీతారామచంద్ర ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:00 గంటలకు సిరిసిల్ల పట్టణంలోని పోస్ట్ ఆఫీసు వద్ద ఉన్న సీతారామ ఆలయంలో పూజల్లో పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం 1:00 గంటలకు సిరిసిల్ల పట్టణంలో పలు శుభకార్యాలకు హాజరై పలువురిని పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా నాయకులు, పార్టీ శ్రేణులు భారీగా హాజరుకానున్నారు.

# సిరిసిల్లలో 27వ వార్డులో వంద శాతం పన్ను వసూలు

- **కౌన్సిలర్ పద్మ, మున్సిపల్ సిబ్బందికి సన్మానం**

**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డులో 100 శాతం ఇంటి పన్ను వసూళ్లు సాధించిన సందర్భంగా వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ, వార్డు ఆఫీసర్ రంగరాజు, బిల్ కలెక్టర్ నరేశ్‌లను పురపాలక సంఘం చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాదిర్ పాషా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడుతూ, 27వ వార్డు ప్రజల సహకారం, మున్సిపల్ సిబ్బంది కృషితో ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. ఇతర వార్డులు కూడా ఇదే విధంగా పన్నుల వసూళ్లలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈ వాణి, రెవెన్యూ ఆఫీసర్ రామ్మోహన్ రాయ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాయి కృష్ణతో పాటు ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నేడు రాములోరి కల్యాణం

- **పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్**
- **శివార్చన మండపంలో కల్యాణ వేదిక సిద్ధం**
- **ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ అధికారులు**

**ప్రజానావ, వేములవాడ:** ప్రసిద్ధ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవాలకు భక్తజనం రాకను దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేశారు. రాబోయే శ్రీరామనవమి సందర్భంగా జరిగే ఈ మహోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయ పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన శివార్చన మండపంలో కల్యాణ వేదిక సిద్ధం చేశారు. లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సీతారాముల వారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. భక్తులు కల్యాణోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేలా పెద్ద ఎల్ఈడి స్క్రీన్లు, సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

**ప్రత్యేక హోమాలు, అభిషేకాలు**

సీతారాముల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాజరాజేశ్వర స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, కుటుంబ దేవతలకు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. యాగశాలలో పుణ్యాహవచనం, మూలమంత్ర హోమం, అగ్ని ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమాలకు దంపతులు కన్యాదాతలుగా పాల్గొన్నారు. వేద పండితులు పూజలను నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా రామాయణ పారాయణం, రామ గీత, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.





**300 మంది బందోబస్తు**

వేములవాడలో జరుగుతున్న సీతారాముల కల్యాణోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రాకపోకలకు సౌకర్యంగా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# 1 నుంచి ‘మన ఇసుక వాహనం’ ద్వారా ఇసుక సరఫరా

- **అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు**
- **సాండ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఏప్రిల్ 1 నుంచి ‘మన ఇసుక వాహనం’ విధానం ద్వారా నిర్మాణ పనులకు ఇసుక సరఫరా ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేశ్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్‌ల నుంచే ఇసుక సరఫరా చేయాలని సూచించారు. ‘మన ఇసుక వాహనం’ సేవను వినియోగించుకోవాలంటే ప్రజలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి, ఇసుక రీచ్‌లను రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటుక




బట్టీలు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలోనే ఇసుక సరఫరా జరగాలని ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీఎస్పీ కే. నాగేంద్రచారి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, నీటి పారుదల, భూగర్భ జల శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత లక్ష్యాలను సాధించని వైద్యాధికారులపై చర్యలు

- **జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. రజని**
- **పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమీక్ష సమావేశం**

**ప్రజానావ, సిరిసిల్ల:** నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని, లేదంటే సంబంధిత వైద్యాధికారులపై చర్య లు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. రజని స్పష్టం చేశారు. గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. గర్భిణీ స్త్రీల నమోదు, ప్రమాదకర గర్భిణీల చెకప్‌లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీసం 70 శాతం సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, తల్లులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు, ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలని ఆదేశించారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా రక్తపోటు, మధుమేహం, వివిధ రకాల క్యాన్సర్ల స్క్రీనింగ్‌ను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. టీబీ నియంత్రణలో భాగంగా 60 ఏళ్లు పైబడినవారు, బరువు కోల్పోయినవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షలు చేయాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం కింద హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు



వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు.

**వడదెబ్బపై అవగాహన**

వడదెబ్బ (సన్‌స్ట్రోక్) నివారణపై కూడా అవగాహన కల్పిస్తూ, శిశువులు, గర్భిణులు, బయట పనిచేసే వ్యక్తులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే బాధితులను చల్లని ప్రదేశంలో ఉంచి, ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వడం, శరీరాన్ని చల్లని నీటితో తుడవడం చేసి సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా. సంపత్, డా.అనిత, డా.రామకృష్ణ, డా.నయీమా, డీపీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్ల ప్రాంతాన్ని సందర్శిస్తా

- **నేత పరిశ్రమ, కార్మికుల పరిస్థితిని తెలుసుకుంటా**
- **నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌కు గవర్నర్ సత్కారం**

**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల నేత పరిశ్రమ, అక్కడి కార్మికుల పరిస్థితిని తెలుసుకునేందుకు త్వరలో ఆ ప్రాంతాన్ని సందర్శిస్తానని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రకాశ్ శుక్లా తెలిపారు. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం లోక్ భవన్లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల నేత పరిశ్రమపై గవర్నర్ వివరాలు తెలుసుకున్నారు. కార్మికులకు మేలు జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీర, జీ20 లోగోను నేసి ప్రధాని ప్రశంసలు అందుకున్న హరిప్రసాద్‌ను గవర్నర్ శివ ప్రకాశ్ శుక్లా సత్కరించారు. చేనేత రంగంలో ఆయన చేసిన వినూత్న ప్రయోగాలను అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు వెదురుతో తయారు చేసిన సిరిసిల్ల మరమగ్గం జ్ఞాపికను హరిప్రసాద్ అందజేశారు.

# మోడీ వైఫల్యంతోనే పెట్రో ఇబ్బందులు




- ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రధాని ఖండించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్

**ప్రజానావ, సిరిసిల్ల:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని, ప్రపంచ శాంతి కోసం భారత ప్రభుత్వం ఇతర దేశాలతో కలిసి కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ వైఫల్యంతోనే గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు, ఇంధన కొరతను అరికట్టాలని కోరుతూ గురువారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు నెహ్రూ నగర్ ఆర్ఎంపీ భవన్‌లో సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 29న చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించాలని లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష పార్టీల నేతలు నిర్ణయించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు మాట్లాడుతూ, భారత ప్రజలు సంప్రదాయంగా శాంతికాముకులని, శాంతి సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. యుద్ధ విరమణకు అన్ని పార్టీలు కలిసివచ్చి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం భారతదేశానికి హానికరమని, యువత దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# రూ.5 లక్షల్లోనే ఇందిరమ్మ ఇల్లు

- కేవలం మూడు నెలల్లో పనులు పూర్తి
- 400 చదరపు ఫీట్లలో ఆధునిక గృహాలు
- ఫిల్లర్ రూఫింగ్ సాంకేతికతతో ఖర్చు తగ్గింపు




**ప్రజానావ, సిరిసిల్ల :** ఇల్లు లేని పేదల సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో కేవలం రూ.5 లక్షల వ్యయంతో, 400 చదరపు ఫీట్లలో ఆధునిక సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తూ, నిర్మాణాన్ని సులభతరం చేసింది. 400 నుంచి 600 చదరపు ఫీట్ల వరకు ఇళ్లను నిర్మించుకునే అవకాశం కల్పిస్తోంది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో మోడల్ హౌస్‌లను నిర్మించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలాఉంటే గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో మొత్తం 11 మోడల్ ఇందిరమ్మ ఇళ్లను కేవలం మూడు నెలల్లోనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ ఇళ్లలో హాల్, బెడ్‌రూమ్, అటాచ్డ్ బాత్రూమ్, కిచెన్ వంటి సౌకర్యాలు కల్పించారు.

**ఆధునిక సాంకేతికతతో నిర్మాణం**

గోడల నిర్మాణానికి సిమెంట్ ఇటుకలు ఉపయోగించగా, కిటికీలు, తలుపులు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా సిమెంట్ ఫ్రేములు వినియోగించారు. స్లాబ్ నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని ఉపయోగించడం వల్ల సాధారణ ఇళ్లతో పోలిస్తే 40 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని అధికారులు తెలిపారు. ఈ ఇళ్లను ఎండాకాలంలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక సాంకేతికతతో నిర్మించారు. నిర్మాణంలో కాంక్రీట్, ఐరన్ వినియోగాన్ని తగ్గించి ఖర్చు తగ్గించడమే కాకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ప్రత్యేక కమిటీలు, హౌసింగ్ అధికారులు అందుబాటులో ఉన్నారు. నిర్మాణ సామగ్రి, ఇతర ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తమ సొంతింటి కలను సాకారం చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

# యాసిడ్ దాడులపై కఠిన చర్యలు



- 'శక్తి' బిల్లులో కీలక మార్పులు
- బాధితుల గుర్తింపు ద గోప్యతకు ప్రాధాన్యం

**ప్రజానావ, ముంబై:** మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, డిజిటల్ వేధింపులను అరికట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళల రక్షణకు మరింత బలం చేకూర్చేలా 'శక్తి' బిల్లులో పలు కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. గత కొన్నేళ్లుగా సోషల్ మీడియా వినియోగం పెరగడంతో పాటు మహిళలు డిజిటల్ వేధింపులను అధికంగా ఎదుర్కొంటున్నారు. మెసేజ్ ఇన్‌బాక్స్‌లు, సోషల్ మీడియా పోస్టులలో అభ్యంతరకర వ్యాఖ్యలు, కామెంట్లు పెరుగుతున్న నేపథ్యంలో ఈ బిల్లుకు ప్రాధాన్యం పెరిగింది. మహారాష్ట్ర శాసనసభ బుధవారం భారతీయ న్యాయ సంహిత బిల్లు-2026ను ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో 'శక్తి' బిల్లులోని కఠిన నిబంధనలకు మార్గం సుగమమైంది. ఈ బిల్లు డిజిటల్ వేధింపులు, యాసిడ్ దాడులు, లైంగిక వేధింపుల బాధితులను రక్షించడమే లక్ష్యంగా రూపొందించబడింది.

**డిజిటల్ వేధింపులకు కఠిన శిక్షలు**

కొత్త బిల్లు ప్రకారం, టెలిఫోన్, ఈమెయిల్, సోషల్ మీడియా ద్వారా జరిగే మానసిక వేధింపులను కూడా 'లైంగిక వేధింపులు'గా పరిగణిస్తారు. ఇలాంటి కేసుల్లో నేరం రుజువైతే గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా నిబంధనలు ప్రతిపాదించారు. అలాగే యాసిడ్ దాడుల బాధితుల పట్ల సున్నితమైన వైఖరిని అవలంబిస్తూ, వారి గుర్తింపు వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచే విధానాన్ని ఈ బిల్లులో పొందుపరిచారు. దీనివల్ల బాధితులు భవిష్యత్తులో సామాజిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు సహాయపడుతుంది. 2020లో మహారాష్ట్ర ప్రభుత్వం 'శక్తి' బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాలను సవరించి కొత్తగా 'భారత న్యాయ సంహిత'ను ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో కొన్ని సాంకేతిక కారణాల వల్ల బిల్లును ఉపసంహరించుకున్నారు. దీనిపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ, కేంద్రం తీసుకువచ్చిన కొత్త చట్టాలకు అనుగుణంగా రాష్ట్రంలో అవసరమైన మార్పులను అధ్యయనం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ కమిటీ సిఫార్సుల మేరకు సవరించిన కొత్త బిల్లును తీసుకువచ్చినట్లు వెల్లడించారు.

# ఎంఎస్ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన




**ప్రజానావ, సిరిసిల్ల:** ఎంఎస్ఎంఈలకు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కలిగి ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ, ప్రతి యూనిట్ తప్పనిసరిగా ఈ సర్టిఫికేట్ పొందాలని అధికారులు సూచించారు. ర్యాంప్ ప్రాజెక్ట్ కింద జిల్లా పరిశ్రమల కేంద్రం, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో ఈడీసీ బృందం గురువారం ఎల్లారెడ్డిపేట ఐటీఐ కళాశాలలో ఒకరోజు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ హనుమంతు పాల్గొని, ఎంఎస్ఎంఇలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌ను ఎలా పొందాలో వివరించారు. ఈ రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు సహాయం కావాలనుకునే వారు కలెక్టరేట్‌లోని ఈడీసీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. గెస్ట్ ఫ్యాకల్టీలుగా బి. విజయ్ కుమార్ (ఫెసిలిటేటర్), జి. వంశీకృష్ణ (డీఎల్‌టీ) పాల్గొని ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఈడీసీ మేనేజర్ కె. జయంత్, అసిస్టెంట్ మేనేజర్ టి. వెంకట శివసాయి నిర్వహించారు.



## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందు బాబులకు జరిమానాలు

**112 మందిపై కేసులు నమోదు.. వేములవాడ సీఐ వీరప్రసాద్**

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన మందుబాబులకు కోర్టు జరిమానాలు విధించింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 112 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఈ కేసులను పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా, వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి 86 మందికి ఒక్కొక్కరికి రూ.5,000, మరో 26 మందికి ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానాలు విధిస్తూ తీర్పు వెలువరించినట్లు టౌన్ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. అనంతరం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామ్మోహన్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపై మద్యం సేవించి వాహనాలు నడపబోమని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ, పట్టణంలో ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, ఇలాంటి కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ప్రతికూల ప్రభావం ఉంటుందని సూచించారు. ట్రాఫిక్, రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## ప్రమాద బీమా చెక్కు అందజేత

**ప్రజానావ, సిరిసిల్ల:** మధ్యతరగతి వ్యాపార, ఉద్యోగ వర్గ ప్రజలకు గాయత్రి బ్యాంకు రుణాలు అందిస్తూ, నామమాత్రపు చార్జీలతో ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ ఖాతాదారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా అందిస్తున్నట్లు మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ తెలిపారు. గురువారం స్థానిక గాయత్రి బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారుడు గోగికార్ చంద్రశేఖర్ ప్రమాదవశాత్తు మరణించగా, ఆయన గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాకు అనుబంధంగా ఉన్న ప్రమాద బీమా ద్వారా నామినీ అయిన ఆయన భార్య గోగికార్ సామిల్‌కు రూ.1 లక్ష చెక్కును చింతోజు భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి బీమా పథకాలు ఖాతాదారుల కుటుంబాలకు అవసరమైన సమయంలో పెద్ద మద్దతుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సమ్మెట శ్రీనివాస్, సిబ్బంది శ్రీకాంత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు, జరిమానా

**సిరిసిల్ల టౌన్ సీఐ శ్రీనివాస్ హెచ్చరిక**

**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన మందుబాబులపై కోర్టు జరిమానాలు విధించింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో 22 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని పోలీసులు గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా, మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు ప్రకారం ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1,000, ఇద్దరికి రూ.1,500, 10 మందికి రూ.2వేలు, ఒకరికి రూ.2,500, ఐదుగురికి రూ.5వేలు, మరొకరికి రూ.7వేల జరిమానాలు విధించినట్లు టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం పట్టుబడిన వారికి ట్రాఫిక్ ఎస్ఐ దిలీల్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి, ఇకపై మద్యం సేవించి వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, పట్టణంలో ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఇలాంటి కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. ట్రాఫిక్, రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



